సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం, 14, మే, 2024



ఓటు వేసేందుకు సొంతంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో వెళ్తున్న జి.మాడుగుల మండలం కిల్లంకోట గిరిజనులు



రంపచోడవరంలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు హెలికాప్టర్ నుంచి ఈవీఎంలను దించుతున్న సిబ్బంది

6.73% | 18.07% | 32.75% | 48.67% | 63.09%

ఓటెత్తారు

- ఉదయం నుంచి రాత్రి వరకూ సడలని సంకల్పం
- ఉత్సాహంగా ఓటేసిన మహిళలు, వృద్ధులు
- గంటల తరబడి లైన్లో వేచి ఉండి ఓటు హక్కు వినియోగం
- సమయం మించిపోయినా కదలని ఓటరు
- జోరువానలోనూ అదే జోరు
- పలు చోట్ల ఆలస్యంగా సాగిన ఓటింగ్

ఓటింగ్ శాతం ఇలా..

అల్లూరి జిల్లా	63.09
విశాఖ పార్లమెంట్	68.13
అనకాపల్లి జిల్లా	70.45

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఓటు పోటెత్తింది. ఉదయం 7 గంటలకు మొదలైన ఓట్ల ప్రవాహం.. రాత్రి 10 గంటల వరకూ అదే జోరుతో సాగింది. గంటల తరబడి ఓటర్ క్యూల్లో వేచి ఉండి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాత్రి వేళలో కొన్ని ప్రాంతాల్లో జోరువానలోనూ ఓటు సంకల్పం సడలలేదు. యువతరం ఉత్సాహాన్ని మించేలా.. వృద్ధులు, మహిళలు, గ్రామీణ ఓటర్లు వెల్లువలా తరలివచ్చారు. తమ తలరాతను మార్చే రథ సారథులను ఎన్నుకోవడంలో ఓటర్లు కీలక పాత్ర పోషించారు. ప్రతీ బూత్.. ఓటర్లతో సందడి వాతావరణం కనిపించింది. తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతలో కొత్త ఉత్సాహం కనిపించింది. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగు పడేందుకు.. నిరంతరం ప్రజలతో మమేకవుతున్న నాయకత్వానికే మరోసారి పట్టం కట్టేందుకు మొగ్గు చూపినట్లు ట్రెండ్ కనిపించింది. పోలింగ్ కేంద్రం వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు చిన్నా.. పెద్దా పోటీ పడ్డారు. పలు బూత్‌ల వద్ద ఎన్నికల సంఘం సెల్ఫీ స్టాండ్లను ఏర్పాటు చేసింది. మొత్తంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 63.09 శాతం, విశాఖపట్నం జిల్లాలో 68.13 శాతం, అనకాపల్లి జిల్లాలో 70.45 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సరళి కొనసాగిందిలా..

ప్రతీ ఎన్నికల్లో ఉదయం, సాయంత్రం పోలింగ్ శాతం అధికంగా నమోదవుతుంది. మధ్యాహ్నం సమయంలో పోలింగ్ మందకొడిగా సాగుతుంది. అయితే ఈ సారి ఎన్నికల్లో మాత్రం మధ్యాహ్నం కూడా ఎక్కడా ఓటింగ్ శాతం తగ్గిపోలేదు. మండుటెండలోనూ ఓటర్లు తమ హక్కును ఉపయోగించుకోవడం కనిపించింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో ఉదయం 9 గంటలకు 10.24 శాతం, 11 గంటలకు 20.47, ఒంటి గంటకు 34.75, 3 గంటలకు 47.66 శాతం నమోదైంది. అంటే మధ్యాహ్న సమయంలో సుమారు 13 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. ఇక 5 గంటల సమయానికి 59.39 శాతానికి పెరిగింది. విశాఖ పార్లమెంట్ పరిధిలో మొత్తంగా 68.13 శాతం నమోదైంది. అల్లూరి జిల్లాలో ఉదయం 9 గంటలకు 6.73 శాతంతో మందకొండిగా మొదలై 11 గంటలకు 18.07 శాతానికి చేరుకుంది. ఒంటి గంటకు 32.75 శాతం, 3 గంటలకు 48.67 శాతం... సాయంత్రం 4 గంటలకు 62.24 శాతంగా నమోదైంది. అప్పటికీ ఇంకా ఓటర్లు క్యూల్లో ఉండటంతో ఈ పోలింగ్ శాతం 63.09కు చేరింది. అనకాపల్లి జిల్లాలో ఉదయం 9 గంటలకు 8.47 శాతం పోలింగ్‌తో నెమ్మదిగా నమోదై.. 11 గంటలకు 19.97 శాతానికి చేరుకుంది. ఆ తర్వాత ఒక్కసారిగా గేర్ మారింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ఏకంగా సగానికిపైగా పోలింగ్ పూర్తయి 53.45 శాతం నమోదైంది. తర్వాత 3 గంటలకు 58.11 శాతం, సాయంత్రం 5 గంటలకు 69.3 శాతానికి చేరి.. మొత్తంగా 70.45 శాతం పోలింగ్ నమోదైంది. విశాఖ, అనకాపల్లి జిల్లాలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసింది. అయితే, అప్పటికే ఓటింగు కోసం లైన్‌లో ఉన్న వారందరికీ అవకాశం కల్పించడంతో రాత్రి వరకూ ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. మరోవైపు సాయంత్రం ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం సైతం ఓటర్ల సంకల్పాన్ని చెక్కుచెరపలేకపోయింది. ఒకవైపు వర్షంతో కరెంట్ సరఫరా నిలిచిపోయి.. ఓటింగ్‌కు ఆలస్యమవుతుందని తెలిసినప్పటికీ.. వేచి ఉండి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానంగా మహిళలు, వృద్ధులు వెనుదిరగకుండా క్యూలో ఉండి మరీ ఓటు వేశారు.



జి.మాడుగులలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న పాడేరు ఆర్వో భావన విశిష్ట



దుప్పలవాడలో ఓటేసేందుకు బారులు తీరిన గిరిజనులు

ఏజెన్సీలో ప్రశాంతంగా..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. గతంలో ఎన్నడూ లేనంతగా పోలీసు బలగాలను మోహరింపు చేశారు. ఏజెన్సీ వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయించడం, కొన్ని చోట్ల వర్షం కురిసినా ఓటు వేసేందుకు గెడ్డలు దాటి ప్రజలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. కొన్నిచోట్ల సాంకేతిక కారణాల వల్ల కొంతసేపు ఇబ్బంది కలిగినా సిబ్బంది త్వరితగతిన పరిష్కరించడంతో యథావిధిగా పోలింగ్ జరిగింది. మన్యంలో మునుపెన్నడూ లేనంతగా ఓటింగ్ జరిగింది. అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ భారీగా ఓటింగ్‌కు పోటెత్తారు. శివారు గ్రామాల నుంచి గిరిజనులు, ఆదివాసీలు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా క్యూలో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం కురిసిన వర్షాన్ని సైతం పట్టించుకోకుండా గిరిజనులు ఓటు వేశారు.

- మారేడుమిల్లి మండలం గుర్తేడు ప్రాంతంలో పోలింగ్ అనంతరం ఈవీఎంలను హెలికాప్టర్‌లో రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.
- గూడెంకొత్తవీధి మండలం కప్పకొండ గ్రామస్తులు గుర్రాలపై వచ్చి దుప్పలవాడ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కొన్ని ప్రాంతాల్లో 15 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు. 2004, 2014లో పలకజీడి పోలింగ్ కేంద్రంపై దాడి చేసిన మావోయిస్టులు జీపును తగులబెట్టారు. ఈవీఎంలు పనిచేయకుండా చేసేశారు. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకుని పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుంకుపూడిలో తొలిసారిగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన భూసిపుట్టు, రంగబయలు, బుంగాపుట్టు పంచాయతీల పరిధిలో భారీ గ్రేహౌండ్స్ పోలీసు బలగాల మధ్య ఓటింగ్ జరిగింది. బుంగాపుట్టు పంచాయతీ పరిధిలో 19 గ్రామాలకు చెందిన 1313 మంది ఓటర్లకు లక్ష్మీపురం పోలింగ్ కేంద్రంలో అవకాశం కల్పించారు. వీరందరినీ నాలుగు జీపుల్లో అధికారులు పోలింగ్ కేంద్రానికి తరలించారు.
- కొన్ని ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అరగంట నుంచి గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసినప్పటికీ... క్యూలో నిలబడిన వారు ఓటు వేసేందుకు అవకాశం ఉండటంతో రాత్రి వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన ఏజెన్సీలో ఎటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా పోలింగ్ ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

వెబ్ కాస్టింగ్ నిరంతర పరిశీలన





వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయసునీత, సాధారణ ఎన్నికల పరిశీలకుడు వివేకనందన్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 695 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కె.వివేకానందన్ నిరంతరం పరిశీలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఓటింగ్‌కు గిరిజనులు తరలిరావడం, పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత కృష్ణాపురం పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.అక్కడే ఓటు హక్కును వినియోగించుకున్నారు. జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి పోలింగ్ ప్రక్రియను సమీక్షించారు.అనంతరం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించారు.అలాగే పాడేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి,జేసీ భావన విశిష్ట జి.మాడుగులలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.పోలింగ్ ప్రక్రియను పరిశీలించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని ఇక్కడ సిబ్బందిని ఆదేశించారు.

స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

సాక్షి, పాడేరు: జిల్లాలోని పాడేరు, అరకులోయ అసెంబ్లీ స్థానాల పరిధిలో పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలు సోమవారం రాత్రి పాడేరు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్నాయి. పాడేరుకు సంబంధించి 304 పోలింగ్ కేంద్రాలు, అరకులోయ పరిధిలో 318 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పోలింగ్ అనంతరం ఆయా వాహనాల్లో సురక్షితంగా ఈవీఎంలను చేరుస్తున్నారు. రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని 399 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలు రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూంకు చేరుకున్నాయి.



ఈవీఎంలతో పాడేరులోని రిసెప్షన్ సెంటర్‌కు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

అడుగడుగునా ఉల్లంఘనలు

పొత్తు కుదుర్చుకుని ఉమ్మడిగా బరిలో దిగిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎక్కడికక్కడ ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కేందుకు యత్నించారు. దౌర్జన్యాలకు దిగి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు యత్నించారు. అనకాపల్లి జిల్లాలో సీఎం రమేష్ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఏకంగా పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి సిబ్బందితో సెల్ఫీలు దిగుతూ ప్రచారం చేసేందుకు ప్రయత్నించారు. ఇక నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు ఓటమి భయంతో అధికారులపై మాటల దాడికి దిగారు. బెదిరింపులకు పాల్పడ్డారు. మరోవైపు అనేక నియోజకవర్గాల్లో ఓటరు స్లిప్పులతో పాటు సూపర్ సిక్స్ హామీలతో కూడిన పత్రాలను కూడా పంపిణీ చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో కొద్ది మంది పోలింగ్ సిబ్బంది కళ్లు కనపడని వారి ఓట్లను తమకిష్టమైన వారికి వేసేందుకు యత్నించారు. విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి తమ జెండాను పోలింగ్ కేంద్రం సమీపంలో కట్టారు. విశాఖ దక్షిణంలో కొద్ది మంది రౌడీ యువకులు ఓటర్లను భయపెట్టే ప్రయత్నం చేశారు. ఏదీఏమైనప్పటికీ ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను అందులోనూ ప్రధానంగా మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రానికి రాకుండా చేసేందుకుగానూ భయభ్రాంతులకు గురిచేసేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ఇవేవీ పట్టించుకోకుండా ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకున్నారు.



సీలేరులో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం వ్యాన్లలో వెళ్తున్న గిరిజనులు



చోటముఖిపుట్టు పోలింగ్ కేంద్రం వద్ద మోహరించిన కేంద్ర పోలీసు బలగాలు



జి.మాడుగుల మండలం బందవీధి పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



సుజనపేట పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళ ఓటర్లు



ముంచంగిపుట్టులో పోలింగ్ ముగించుకొని వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



అడ్డతీగల మండలం పనుకురాతిపాలెం నుంచి ఏలేరు వాగు దాటుకుని ఈవీఎంలతో వస్తున్న ఎన్నికల సిబ్బంది



ఓటు హక్కు వినియోగించుకునేందుకు గెడ్డ దాటుతున్న డుంబ్రిగుడ మండలం గొందిగూడ గ్రామస్తులు



పెదబయలు: ఓటు వేసేందుకు చీకుపనస పోలింగ్ కేంద్రానికి కాలినడకన వస్తున్న గిరిజనులు



ఓటు వేసినట్టు చూపిస్తున్న మహిళలతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి తదితరులు



చింతపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తనూజారాణి

నిఘా నీడలో పోలింగ్

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహణ
- గుర్తేడు నుంచి హెలికాప్టర్‌లో స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంల తరలింపు
- గణనీయంగా పెరిగిన ఓటింగ్ శాతం



సుర్మతి రోడ్డులో మోహరించిన పోలీసు బలగాలు



తుమ్మలలో ఈవీఎంలు తీసుకెళుతున్న సిబ్బంది

సాక్షి,పాడేరు: జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 695 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల వ్యవస్థతో వెబ్‌కాస్టింగ్‌ను ఆదివారం నుంచి అందుబాటులో ఉంచారు. పోలీసు బలగాల నిఘా మధ్య పోలింగ్ నిర్వహించారు. మారుమూల గ్రామాల ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సీలేరు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సీలేరు, దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో భారీ పోలీసు బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుంచి ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రజలు బారులుతీరారు. దుప్పలవాడ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు కప్పకొండ గ్రామం నుంచి గుర్రాలపై వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈవీఎంలను ప్రత్యేక బస్సులో పాడేరు తరలించారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాయంత్రం 4 గంటల సమయంలో ఒడిశా పోలీసులు సీలేరు పరిసర ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు.

గూడెంకొత్తవీధి: మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుంకుంపూడి, కొమ్ములవాడ, కొత్తపల్లిలో పోలింగ్ కేంద్రాలకు గిరిజనులు భారీగా తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మారేడుమిల్లి : వై.రామవరం మండలంలో సమస్యాత్మక ప్రాంతమైన గుర్తేడులో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలింగ్ కేంద్రాల నుంచి హెలికాప్టర్లలో ఈవీఎంలను గుర్తేడు తీసుకువచ్చారు. పోలింగ్ అనంతరం సాయంత్రం వాటిని హెలికాప్టర్‌లో రంపచోడవరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

చింతూరు: ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అల్లిగూడెం, నారకొండ, పేగ, చిడుమూరు పోలింగ్ కేంద్రాల పరిసర అటవీ ప్రాంతంలో అదనపు బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఏడుగురాళ్లపల్లి, బొడ్డుగూడెం, సరివెల, తుమ్మల, సింగన్నగూడెం పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగిసిన అనంతరం భద్రత నడుమ పోలింగ్ సామగ్రిని, సిబ్బందిని బస్సులలో తరలించారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా, సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌లు భద్రతా చర్యలను పర్యవేక్షించారు.

ముంచంగిపుట్టు: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని అత్యంత మారుమూల మావోయిస్టు ప్రభావిత పంచాయతీలైన భూసిపుట్టు, బుంగాపుట్టు, రంగబయలు, జామిగూడ, ఇంజరి, గిన్నెలకోటలో పోలింగ్ శాతం పెరిగింది. ఉదయం నుంచి బారులు తీరారు. రహదారులు అందుబాటులోకి రావడంతో స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. బుంగాపుట్టులో నాలుగు ప్రైవేట్ జీపులను అధికారులు ఏర్పాటు చేసి లక్ష్మీపురంలోని పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. గతంలో 40 శాతం మాత్రమే పోలింగ్ నమోదయ్యే కేంద్రాల్లో 50 నుంచి 65శాతం నమోదైంది.

తప్పిన అవస్థలు

పెదబయలు: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు అందుబాటులోకి రావడంతో ఎన్నికల సిబ్బందికి, పరిసర ప్రాంతాల ప్రజలకు అవస్థలు తప్పాయి. ఇంజరిలో ఏర్పాటుచేసిన ఇంజరి, చీకుపనస పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది మద్దిగరువు వరకు వాహనాల్లో చేరుకుని అక్కడినుంచి గుర్రాలపై వెళ్లేవారు. ఇప్పుడు రహదారులు అందుబాటులోకి రావడంతో సిబ్బంది ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు.













ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ విజయ సునీత, రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్, ఎమ్మెల్సీ రవిబాబు దంపతులు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి దంపతులు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి దంపతులు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ,అనురాధ, అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజరాణి, చెట్టి వినయ్ దంపతులు, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు దంపతులు, రంపచోడవరం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు, అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దంపతులు.

– సాక్షి, నెట్‌వర్క్

నవోదయ విద్యార్థుల ప్రతిభ


విశాల్


ప్రసాద్

ఎటపాక: సోమవారం ప్రకటించిన సీబీఎస్ఈ టెన్త్, 12వ తరగతి ఫలితాల్లో ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కరాచారి తెలిపారు. పదవ తరగతిలో పండా విశాల్ 466 మార్కులు సాధించి(500 మార్కులకు) ప్రథమ స్థానంలో నిలిచాడు. బి.హేమగణలత 463 మార్కులతో ద్వితీయ స్థానంలో, 460 మార్కులతో అంకిత మూడవ స్థానంలో నిలిచారు. అదే విధంగా 12వ తరగతిలో ఎల్.ప్రసాద్ 433 మార్కులతో ప్రథమ, మాన్విత వినీల దొర 424 మార్కులతో ద్వితీయ, బ్లెస్సీ 413 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం నేతృత్వంలో ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు మంచి మార్కులు సాధించటం అభినందనీయమని ప్రిన్సిపాల్ భాస్కరాచారి తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ప్రతిభ చాటిన ఆయా విద్యార్థులను పలువురు అభినందనలు తెలిపారు.

ప్రశాంతంగా పోలింగ్

పాడేరు/అనంతగిరి/రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ప్రధానంగా పోలీసు యంత్రాంగం ఒకింత సంతోషం వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ దళాలు మరింత అప్రమత్తమయ్యారు. గతంలో ఎన్నడూ లేనంతగా పోలీసు బలగాలను మోహరింపు చేశారు. ఏజెన్సీ వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లలో ఈవీఎంలు మొరాయించడం..కొన్ని చోట్ల వర్షం కురిసినా ఓటు వేసేందుకు గెడ్డలు దాటి ప్రజలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. మన్యంలో మునుపెన్నడూ లేనంతగా ఓటింగ్ జరిగింది. అందరి అంచనాలను పటాపంచలు చేస్తూ భారీగా ఓటింగ్‌కు పోటెత్తారు. ఓటు వేసేందుకు శివారు గ్రామాల నుంచి గిరిజనులు..ఆదివాసీలు తరలి వచ్చారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా క్యూలైన్లలో నిల్చొని భారీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం కురిసిన వర్షాన్ని సైతం పట్టించుకోకుండా గిరిజనులు ఓటు వేశారు.


ఇంజరి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


చింతపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


జి.మాడుగులలో బారులు దీరిన ఓటర్లు


రాచవీధి పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న ఓటర్లు


నుర్మతి పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు


చౌడుపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో వీరసాయి బాబు


లక్ష్మీపురంలో క్యూలో ఉన్న ఓటర్లు


వీఆర్ పురం మండలం రాజుపేటలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళా ఓటర్లు


పాడేరు పట్టణంలోని గుడివాడ పాఠశాల పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉన్న ఓటర్ల


పాడేరు సుండ్రుపుట్టు పోలింగ్ కేంద్రానికి తన తల్లిని ఓటింగ్‌కు తీసుకువస్తున్న దృశ్యం


ఇంజరి పంచాయతీలోని చీకుపనస పోలింగ్ కేంద్రంలో పోలీసు బలగాల నిఘా


చీకుపనసలో పోలీసు బలగాల సంచారం


ఎటపాక గౌరిదేవిపేటలో సహాయకులతో ఓటువేసేందుకు వచ్చిన వృద్ధుడు


పెదబయలులో బారులు తీరిన ఓటర్లు

గుండెపోటుతో ఓటరు మృతి


గుండెపోటుకు గురైన శ్రీనివాసరావును ఆస్పత్రికి తరలిస్తున్న సన్నిహితులు

కొయ్యూరు : మండలంలోని కినపర్తి గ్రామానికి చెందిన నర్ని శ్రీనివాసరావు సోమవారం ఓటు వేసేందుకు వెళ్తుండగా గుండెనొప్పికి గురై మృతి చెందారు. ఇంటి నుంచి బయలుదేరిన ఆయనకు గుండెనొప్పి రావడంతో పడిపోయాడు. వెంటనే అతనిని అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలోని కృష్ణదేవిపేట ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు.

ఓటు వేసేందుకు వెళ్తుండగా అపశృతి

- వాహనం బోల్తా పడి 27 మందికి గాయాలు
- నలుగురి పరిస్థితి విషమం

అనంతగిరి: మండలంలోని కుడియ సమీపంలో సోమవారం బొలెరో పికప్ వాహనం బోల్తాపడి 21 మందికి స్వల్ప గాయాలవగా, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు. పెదకోట పంచాయతీ పాటిపల్లి, టాంకోట, వేలమామిడి గ్రామాలకు చెందిన 25 మంది ఓటర్లు బొలెరో వాహనంలో పెదకోట పోలింగ్ కేంద్రానికి బయలుదేరారు. కుడియ సమీపంలోని మలుపు వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో వాహనం బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలోని పాటిపల్లి గ్రామానికి చెందిన జన్ని కొండమ్మ, ఎస్.నాగులు, బి.కొండబాబు, జె.శుక్రన్న, వి.ఎర్రన్న, బి.చిన్నులమ్మ, పి.ఈశ్వరరావు, పి.పుష్పవతి, టాంకోటకు చెందిన పి.రాములమ్మ, వేలమామిడికి చెందిన పి.వరహాలమ్మ, పి.పెద్దమ్మ, పి.అప్పన్న, ఎస్.రాజు, వి.రత్నయ్య, కె.కొండబాబు, పి.చిన్నలక్ష్మి, పి.అప్పలస్వామి, ఎం.ప్రసాద్, డ్రైవర్ బి.బాలురాజు, హెల్పర్ బి.జగదీష్‌లు స్వల్పంగా గాయపడ్డారు. పాటిపల్లికి చెందిన బోయిన చిన్న, ఉల్లి ఎండమ్మ, పి.రాములమ్మ, కె.తవుడమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరందరికి పినకోట పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాద విషయాన్ని ఐటీడీఏ పీవో అభిషేక్ దృష్టికి వైస్ ఎంపీపీ ఉర్మ శకుంతల సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన ఆయన అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.


బోల్తాపడిన వాహనం


అంబులెన్స్‌లోని క్షతగాత్రులను పీహెచ్‌సీకి తరలిస్తున్న దృశ్యం


తీవ్రంగా గాయపడిన గిరిజనులు

యథేచ్ఛగా టీడీపీ ప్రలోభాలు

- పార్టీల గుర్తుతో ఓటరు స్లిప్పుల పంపిణీ
- ఎన్నికల అధికారులకు అప్పగించిన వైఎస్సార్‌సీపీ నేతలు


టీడీపీ పంపిణీ చేసిన స్లిప్పులను చూపిస్తున్న నేతలు

పాడేరు : ఎన్నికల రోజున కూడా టీడీపీ నేతలు ప్రలోభాలను ఆపలేదు. నియోజకవర్గంలో 318 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లకు ప్రతిపక్ష పార్టీల గుర్తులు కలిగిన స్లిప్పులను యథేచ్ఛ గా ఓటర్లకు అందజేశారు. వాటితోనే కొంతమంది ఓటర్లు పోలింగ్ బూత్‌లకు వచ్చారు. వీటిని గుర్తించిన వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులకు అప్పగించారు. పాడేరు టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యానికి కూటమి నేతల తూట్లు

- అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు
- సీఎం రమేష్ ఓవరాక్షన్.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఎన్నికల ప్రచారం
- టీడీపీ ఏజెంట్లతో ఫొటో షూట్
- క్యూలో నిల్చున్న ఓటర్లకు ప్రలోభాల ఎర
- దేవరాపల్లి మండలం కాశీపురం బూత్‌లో అనుచరులతో హల్‌చల్
- రమేష్‌ను చూసి లేచి నమస్కరించిన పోలింగ్ సిబ్బంది
- రిటర్నింగ్ అధికారికి అయ్యన్న బెదిరింపులు.. బూతు పురాణం
- ఎన్నికల కేంద్రంలోకి కండువాతో వచ్చిన జనసేన అభ్యర్థి పంచకర్ల
- భీమిలిలో ఓటరు స్లిప్పుతో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ
- నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లులో హద్దు దాటిన ఎన్నికల అధికారి
- కళ్లు సరిగా కనిపించని వృద్ధుల ఓట్లు టీడీపీకి వేయించిన వైనం

ఓటమి భయం కూటమి నేతల కుతంత్రాలకు తెరతీసింది. బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు అడుగడుగునా ఎన్నికల కోడ్‌ను అతిక్రమించారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ ధన, అనుచర బలంతో పేట్రేగిపోయారు. డబ్బులు వెదజల్లి సీటు దక్కించుకున్న కూటమి ఎంపీ అభ్యర్థి రమేష్ గత నెల రోజుల నుంచీ చేస్తున్న అరాచకాలను పోలింగ్ రోజైన సోమవారం మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. పోలింగ్ ప్రారంభానికి ముందే మొదలైన ఈ దారుణాలను పోలింగ్ పూర్తయ్యే వరకూ కొనసాగించారు. పోలీసులు, అధికారులు కూడా భయపడ్డ పరిస్థితి.

సాక్షి, అనకాపల్లి: ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన ఎన్నికల్ని కూటమి నేతలు తమ అరాచకాలతో పలు చోట్ల ఓటర్లను భయాందోళనకు గురిచేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో ఉన్న ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తన అనుచరులతో పోలింగ్ బూత్‌ల్లోకి నేరుగా సెల్‌ఫోన్‌లతో ప్రవేశించారు. టీడీపీ ఏజెంట్లతో ఫొటోలు దిగారు. జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులపై దూషణలకు పాల్పడ్డారు. పార్టీ కండువాలతో పోలింగ్ బూత్‌ల్లో ప్రవేశించి ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఓట్లు వేశారు. ఓటర్ స్లిప్‌లతో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ చేస్తూ అడుగడుగునా నిబంధనలకు తూట్లు పొడిచారు.

సీఎం రమేష్ నిబంధనల అతిక్రమణ

బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే కాకుండా పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల ప్రచార కేంద్రంగా మార్చేశారు. మాడుగుల నియోజకవర్గం దేవరాపల్లి మండలం కాశీపురం ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఆయన వెళ్లారు. క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లను కలిసి బీజేపీకి ఓటేయాలంటూ ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ బూత్‌లో ఉన్న టీడీపీ ఏజెంట్లతో ఫొటో షూట్‌కు దిగారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓటింగ్ ప్రక్రియకు ఆటంకం కల్గిస్తున్న ఆయన్ని లోపలికి రానించడంతోపాటు, ఎన్నికల సిబ్బంది సకల గౌరవ మర్యాదలు చేయడం, వంగి వంగి నమస్కారాలు పెట్టడం గమనార్హం. అనంతరం దేవరాపల్లి హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద కూడా ఇదే విధంగా ఆయన వ్యవహరించారు. వారి అనుచరులతో పోలింగ్ బూత్‌లోకి చొరబడి ఓటింగ్ ప్రక్రియకు ఆటకం కలిగించారు.

బూతుల అయ్యన్న

ఎప్పుడూ ఏదో ఒక వివాదంతో ప్రజల ఛీత్కారాలు ఎదుర్కొనే మాజీ మంత్రి, టీడీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు పోలింగ్ రోజూ తన నోటి దురుసును ప్రదర్శించారు. నర్సీపట్నం టౌన్ గరల్స్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారులను బండ బూతులు తిడుతూ రెచ్చిపోయారు. రాయడానికి వీల్లేని తిట్లందుకున్నారు. దీంతో అధికారులు నివ్వెరపోయారు. ఆ బూతులు విని ఓటర్లు అయ్యన్నను అసహ్యించుకున్నారు. ఓటేసేందుకు లైన్లలో నిరీక్షిస్తున్న మహిళల ముందే ఈయన ఈ బూతుల్ని అందుకున్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాంలను దూషించి మాట్లాడాడు.

ఓటరు స్లిప్పుల పేరిట మేనిఫెస్టో కాపీలు

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలో టీడీపీ నేతలు మరింతగా దిగజారారు. ఓటర్ స్లిప్‌లతో పాటు టీడీపీ మేనిఫెస్టోను పంపిణీ చేశారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలో మూలకుద్దు, మధురవాడ, సంతపేట అంబేడ్కర్ హైస్కూల్, పెదబొడ్డేపల్లి ఆర్సీఎం స్కూల్, రామారావుపేట, శివపురం తదితర ప్రాంతాల్లో ఓటరు స్లిప్‌తో పాటు టీడీపీ మేనిఫెస్టో పంపిణీ చేశారు. బంగారుమెట్ట మీద దుర్గాలమ్మ ఆలయం వద్ద సూపర్ సిక్స్ ఫ్లెక్సీ పెట్టి ప్రచారం చేశారు. పెదబొడ్డేపల్లిలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు నిలదీయడంతో పోలీసులు స్లిప్పులు స్వాధీనం చేసుకున్నారు. రామారావుపేటలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకుని ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మోహన్ స్వయంగా వచ్చి స్లిప్పులు స్వాధీనం చేసుకుని టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈ అరాచకాలను అడ్డుకుని, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోయింది.

పార్టీ కండువాతో ఓటింగ్‌కు పంచకర్ల

పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ కూడా నిబంధనల ఉల్లంఘనలో తానేమీ తక్కువ కాదని నిరూపించుకున్నారు. మండలంలోని సుజాతనగర్ డీఏవీ పబ్లిక్ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటేసేందుకు ఉదయం 10 గంటల సమయంలో ఆయన వచ్చారు. పార్టీ కండువాతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించిన అతన్ని అధికారులు ఏ మాత్రం అడ్డుకోకపోవడం గమనార్హం.

ఓటర్ల చైతన్యం.. అధికారిపై చర్యలు

ఓటర్లలో చైతన్యం పెరిగింది. వక్రబుద్ధితో వ్యవహరిస్తున్న ఎన్నికల అధికారికి బుద్ధి చెప్పేలా చేశారు. సోమవారం ఉదయం పాయకరావుపేట నియోజకవర్గం, నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు పోలింగ్ బూత్‌లో కళ్లు సరిగా కనిపించని వృద్ధుల ఓట్లను అక్కడి పోలింగ్ అధికారి టీడీపీకి వేయించాడు. ప్రశించిన ఏజెంట్‌పై దురుసుగా ప్రవర్తించాడు. దేవరాపల్లి మండలం ఎ.కొత్తపల్లిలోని పోలింగ్ బూత్ నెం.173లో వృద్ధురాలు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరగా, పోలింగ్ అధికారి కమలం పువ్వు గుర్తుకు ఓటేశారు. దీన్ని గుర్తించిన 70 ఏళ్ల వృద్ధురాలు నిలదీయడంతో ఏజెంట్లు ప్రశ్నించారు. విషయం ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు తెలియడంతో ఆయన అక్కడికి చేరుకుని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిని విధుల నుంచి తొలగించి వేరేవారిని నియమించారు.


టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్పీ మోహన్

గుర్తేడులో హెలికాప్టర్‌లో ఈవీఎంలు

మావోయిస్టు ప్రభావిత ఏజెన్సీ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేపట్టింది. ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది తరలింపు కోసం రెండు హెలికాప్టర్‌లను ఉపయోగించారు. అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం వై.రామవరం మండలంలో సమస్యాత్మక ప్రాంతమైన గుర్తేడుకు హెలికాప్టర్ సాయంతో ఈవీఎంలను, సిబ్బందిని తీసుకెళ్లారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసింది. అనంతరం భద్రత నడుమ హెలికాప్టర్‌లో ఈవీఎంలను రంపచోడవరం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. గుర్తేడు, పాతకోట రెండు పంచాయతీల్లోని ఆరు బూత్‌లకు గాను 4,463 మంది ఓటర్లు ఉండగా, 2,048 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.